I

సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



కారుచీకట్లో 'కాంతి'రేఖ!

కార్నియ కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి కేంద్రం శుభవార్త చెప్పింది. వివరాలు IIలో ▸



దిగుబడి దిగాలు

ఈసారి అధిక వర్షాలతో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు నష్టాలను మిగిల్చాయి. వివరాలు IIలో ▸



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అన్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

సీపీ విజయ్‌కుమార్



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ విజయ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారికి పలు సూచనలు చేశారు. అనంతరం సీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలని, బ్లూకోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనోధైర్యమే సమస్యలకు పరిష్కారం



'వేలూరు ఆత్మహత్యల గోస' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్: మనోధైర్యంతో ముందుకుసాగితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రముఖ మానసిక వికాస నిపుణుడు వీరేందర్ అన్నారు. వర్గల్ మండలం వేలూరు గ్రామంలో చోటుచేసుకున్న రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత పులి రాజు రచించిన 'వేలూరు ఆత్మహత్యల గోస' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం పట్టణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన వీరేందర్ మాట్లాడుతూ సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోయే మనస్తత్వానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధ వ్యూహకర్త కల్నల్ జీజే రావు మాట్లాడుతూ రైతు ఆత్మహత్యల నివారణకు తనవంతుగా సెప్టెంబర్ 10 సినిమా తీశానని చెప్పారు. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. సమస్యలు ఎదురైనపుడు దాచుకోకుండా, బంధువులకు, సన్నిహితులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది రాజు, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

సిద్దిపేటఎడ్యుకేషన్: పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎకో బజార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విషయంలో విద్యార్థులు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పర్యావరణహిత స్టాల్స్ ను పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతుల అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్ల తనిఖీలకు టీచర్లను వేయొద్దు

టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): పాఠశాలల తనిఖీలకు ఉపాధ్యాయులను వేయొద్దని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చిన్నకోడూరు, అల్లీపూర్, పెద్దకోడూరు, మాచాపూర్, గంగాపూర్ ఉన్నత పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేసి, ఖాళీగా ఉన్న ఎంఈఓ, జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులు భర్తీ చేసి వారి ద్వారా పాఠశాలల పర్యవేక్షణ చేయాలన్నారు. పీఆర్‌సీ వెంటనే అమలు చేసి, ఐదు డీఏలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, కార్యదర్శి దేవ ఋషి, జిల్లా నాయకులు జానికి రాములు, శివాజీ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం



విద్యార్థులకు కారం పొడిని వడ్డిస్తున్న వంట కార్మికురాలు

గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో ఘోరం

- అర్ధాకలితో విద్యార్థులు విలవిల
- కలుషిత నీటితో చర్మ రోగాలు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు

గజ్వేల్/గజ్వేల్ రూరల్: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అధునాతన ప్రమాణాలతో నిర్మించిన ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం మెతుకులే దిక్కవుతున్నాయి. మరోవైపు కలుషిత నీటితో చర్మరోగాల బారిన పడి అల్లాడుతున్నారు. సమస్యలు తెలుసుకునేందుకు గురువారం పట్టణంలోని 'సాక్షి' బాలుర ఎడ్యుకేషన్ హబ్‌ను సందర్శించింది. సరిగ్గా మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఈ పాఠశాలలో మొత్తంగా 529 విద్యార్థులు ఉండగా, మధ్యాహ్న భోజన సమయానికి 509మంది ఉన్నారు. వారి భోజనాన్ని పరిశీలించగా పేట్లల్లో గొడ్డుకారం కనిపించింది. కూరలు వండటం లేదా? గొడ్డుకారంతో ఎందుకు తింటున్నారు? అని అడిగితే కూరలు అయిపోయాయని కారం వేస్తున్నారంటూ బదులిచ్చారు. కారాన్ని తినలేకపోతున్నామని అర్ధాకలితోనే ఉంటున్నామని చెప్పారు. ఇదే క్రమంలో వంట గదిలోకి 'సాక్షి' వెళ్లి చూడగా ఓ మహిళ విద్యార్థుల ప్లేట్లల్లో కారం పొడి వేస్తూ కనిపించారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఈ రోజు పిల్లలు ఎక్కువగా రావడం వల్ల కూరలు అయిపోయాయని చెప్పడం గమనార్హం. మరో విషయమేమిటంటే భోజనాన్ని పిల్లలే తమ ప్లేట్లలో వేసుకోవడం కనిపించింది. అపరిశుభ్ర వాతావరణంలో ప్లేట్లను కడగడం, నేలపైనే కూర్చొని తినడం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. పిల్లలు ఏం తింటున్నారు? వారికి భోజనం సరిపోయిందా? లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సిన ఉపాధ్యాయులు ఏమాత్రం పట్టించుకోకుండా ఆఫీస్ రూమ్‌లో ఉండటం గమనార్హం.



విద్యార్థి ప్లేట్‌లో గొడ్డుకారం

ఒళ్లంతా దద్దుర్లు, కురుపులు

ఇదే హబ్‌లోని బాలుర జూనియర్ కళాశాలను సైతం 'సాక్షి' సందర్శించింది. ఈ కళాశాలలో 571 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులంతా ఇదే ప్రాంగణంలోని హాస్టళ్లల్లో ఉంటున్నారు. కలుషిత నీటితో పిల్లలకు చర్మ రోగాలు వచ్చాయి. ఒళ్లంతా దద్దుర్లు, కురుపులతో అల్లాడుతున్నారు. మరికొందరు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం దృష్టిసారిస్తేనే సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.



కలుషిత నీటి కారణంగా కురుపులు వచ్చాయని చూపుతున్న ఇంటర్ విద్యార్థి కార్తీక్

ఆ షాపులపైనే నజర్



అధిక మద్యం అమ్మకాలు జరిగిన వాటిపై లిక్కర్ వ్యాపారుల దృష్టి

- 11 వైన్స్ షాపులలో రూ.30 కోట్ల చొప్పున అమ్మకాలు
- లెక్కలేస్తున్న మద్యం వ్యాపారులు
- జిల్లాలో 93 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటి వరకు వచ్చిన అప్లికేషన్లు 561

జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రక్రియ జోరందుకుంది. 2025–27కి గాను వైన్ షాప్‌ల కేటాయింపు కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 26 నుంచి ప్రారంభం కాగా, 18వ తేదీతో గడువు ముగియనుంది. దీంతో లిక్కర్ వ్యాపారులు 2023–25లో వైన్‌షాపుల వారీగా జరిగిన మద్యం అమ్మకాలపై దృష్టిసారించారు. ఈ నెల 23న లాటరీ పద్ధతిన మద్యం దుకాణాల కేటాయింపు జరగనుంది.

– సాక్షి, సిద్దిపేట

జిల్లా వ్యాప్తంగా 93 వైన్స్ షాపులు ఉండగా, ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 24, గజ్వేల్ పరిధిలో 26, చేర్యాలలో 16, హుస్నాబాద్‌లో 16, మిరుదొడ్డిలో 11 ఉన్నాయి. రిజర్వేషన్‌లలో ఎస్సీలకు 9, గౌడలకు 16 షాపులను కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్1,2023 నుంచి నవంబర్ 30,2024 వరకు రూ.1,415.32 కోట్లు, డిసెంబర్ 1,2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు రూ.959.98కోట్లు అమ్మకాలు జరిగాయి. ఇలా జిల్లా మొత్తం 2023–25లో ఇప్పటి వరకు రూ.2,375.3కోట్ల మద్యం అమ్మకాలు జరగడం విశేషం.

ఒక్కో షాపులో రూ.30కోట్లకు పైగా..

జిల్లా వ్యాప్తంగా 11 వైన్స్ దుకాణాలలో ఒక్కో షాపులో రూ.30కోట్లకుపైగా విక్రయాలు జరగడం విశేషం. సిద్దిపేట పట్టణంలో షాప్ నంబర్–5లో మొత్తంగా రూ.37.76కోట్ల అమ్మకాలు జరిగాయి. అలాగే జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ నర్సాపూర్ వైన్ షాప్‌లో రూ.34.44కోట్లు, మర్కూక్‌లో రూ.32.7కోట్ల విక్రయాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి.

లెక్కల్లో లిక్కర్ వ్యాపారులు

ఏ ఏరియా వైన్స్‌లో ఎంత మద్యం అమ్మకాలు జరిగాయనేదానిపై ఆయా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లలో పరిచయం ఉన్న వారితో వ్యాపారులు లిస్టులను తెప్పించుకున్నారు. ఎంత వ్యాపారం జరిగితే ఎంత లాభం ఉంటుందన్న విషయంపై లెక్కలేసుకుంటున్నారు. ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు రూ.55లక్షల చెల్లించే షాపులలో ఎక్కువ విక్రయాలు జరిగే వాటిపై సైతం నజర్ పెట్టారు. మద్యం వ్యాపారులు గ్రూప్‌ల వారీగా హోటల్స్, లాడ్జీలలో సమావేశాలు జరుగుతున్నాయి. ఎన్ని షాప్‌లకు.. ఎక్కడి షాపులకు టెండర్లు వేయాలని చర్చించుకుంటున్నట్లు సమాచారం.

"దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

వైన్ షాప్‌ల కేటాయింపు కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 18వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఈ నెల 23న డ్రా ద్వారా షాప్‌లను కేటాయిస్తాం.

– శ్రీనివాస మూర్తి, ఈఎస్

రేపటితో ముగియనున్న గడువు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

వైన్స్ షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 18వతేదీతో ముగియనుంది. ఇప్పటి వరకు కేవలం 561 దరఖాస్తులే వచ్చాయి. 2023–25లో 4,166 దరఖాస్తులు వచ్చాయి. ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచడంతో వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం రోజు 300 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్కిల్ వారిగా సిద్దిపేట 163, గజ్వేల్ 159, హుస్నాబాద్ 145, చేర్యాల 76, మిరుదొడ్డి 18 దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే జిల్లాలో 9 షాప్‌లలో ఒక్క దరఖాస్తు రాలేదు. సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్దిపేట–15, 16, గజ్వేల్ పరిధిలోని నంబర్లు 27, 40, 41, మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో 88, 91, 92, 93 నంబర్ షాప్‌లకు ఇప్పటి వరకు దరఖాస్తులు రాకపోవడం గమనార్హం.



మాట్లాడుతున్న ఏఐసీసీ జిల్లా పరిశీలకురాలు జ్యోతి రౌటేలా

అందరి అభీష్టంతోనే ఎంపిక

- పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి నియామకం
- ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ జ్యోతి రౌటేలా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ నచ్చిన వ్యక్తే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికవుతారని ఏఐసీసీ జిల్లా పరిశీలకురాలు జ్యోతి రౌటేలా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగదీశ్, నజీమ్ అహ్మద్, వరలక్ష్మితో కలిసి జ్యోతి రౌటేలా సిద్దిపేట అర్బన్, పట్టణం, రూరల్, నారాయణరావుపేట మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల, బ్లాక్, జిల్లాస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని కష్టపడే నాయకుడ్ని జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారి కమిటీలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, ప్రజాదరణ ఉన్న నాయకుని నియమించడానికే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్న వారికి అవకాశం ఉంటుందన్నారు. దళిత, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పదేళ్లు కేసీఆర్ నియంతృత్వ పాలన చేశారని ఆరోపించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చే యడమే తమ లక్ష్యం అన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్ష ఆశావహులు కమిటీకి దరఖాస్తులు అందజేశారు.

ఆగం చేసిన వాన

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వరి పంటకు నష్టం వాటిల్లింది. గట్లమల్యాల, అక్కేనపల్లి, ఖాత, ఘణపూర్ గ్రామాల రైతులు వరి పంటను కోసి కల్లాలు ఏర్పాటు చేయడంతో తడిసిపోయాయి. గట్లమల్యాల కొనుగోలు కేంద్రానికి రైతులు వడ్లు తెచ్చి ప్లాట్‌ఫారంపై ఆరబోయగా నీరు నిలిచిపోవడంతో తడిసిముద్దయ్యాయి. ఉదయం అక్కడికి చేరుకున్న రైతులు నీటిని తొలగించి ఆరబెట్టారు.



వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు



గట్లమల్యాల కొనుగోలు కేంద్రంలో తడిసిపోయిన వరి ధాన్యం

మంత్రి వ్యాఖ్యలు సరికావు

హుస్నాబాద్: జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థి వివేక్ మృతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు సరికావని కుటుంబసభ్యులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మృతుని కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేక్ ఆటలాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందాడని మంత్రి అన్న మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్‌ల విచారణ పూర్తి కాకుండానే వ్యాఖ్యానించడంపై కేసు నిర్వీర్యం చేసినట్లేనని అన్నారు. వివేక్ మృతికి కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వివేక్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి కుటుంబ సభ్యుల రాస్తారాకో



హుస్నాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు, దళిత సంఘాల నాయకులు



వివిధ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

సంఘటితంగా ఉద్యమిద్దాం

- 18న బంద్ జయప్రదం చేద్దాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

సిద్దిపేటజోన్: 'రిజర్వేషన్ల సాధనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలన్నీ ఏకమై సంఘటితంగా ఉద్యమిద్దాం. 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దాం' అని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులోని ఓ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈనెల 18న నిర్వహించనున్న బంద్ విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టగా కోర్టు కేసులతో ఆశలపై సందిగ్ధం నెలకొందన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన చివరి దశలో ఉందని, ఒత్తిడి తెచ్చి సాధించుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు చంద్రం, సర్పంచ్ ఫోరం రాష్ట్ర జేఏసీ సెక్రటరీ సుభాష్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శంకర్, జిల్లా సీపీఐ సెక్రటరీ పవన్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నవీన్ గౌడ్, వివిధ సంఘాల ప్రతినిధులు శ్రీహరి, శ్రీనివాస్,రాజేశం, వెంకట్, ఎల్లయ్య, శ్రీనివాస్,నరేందర్ పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తొద్దు

- కలెక్టర్ హైమావతి
- సివిల్‌సప్లై, డీఆర్‌డీఓ అధికారులతో సమావేశం

సిద్దిపేటరూరల్: వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ హైమావతి మిల్లర్లు, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లై, డీఆర్డీఓ అధికారులతో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోళ్లు సివిల్ సప్లై శాఖ అందించిన మార్గదర్శకాల మేరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ సీజన్‌లో 6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 239 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కొనుగోలు చేయగానే గన్నీబాగుల్లో నింపి మిల్లులకు పంపించాలని తెలిపారు. మిల్లులో సైతం తేమ శాతం పరిశీలించాలన్నారు. మిల్లర్లు అగ్రిమెంట్ చేసుకుని బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వరి ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలన్నారు. ఫిజికల్ స్టాక్ , రిజిస్టర్ ఎంట్రీ సమానమవ్వాలన్నారు. లేబర్ కొరత లేకుండా చూసుకుని, ఎక్కడైనా ధాన్యం మళ్లించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ తనూజ, డీఎం సీఎస్ ప్రవీణ్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, డీటీఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

పోస్టుద్వారా పంపిణీ చేస్తున్నాం

నూతనంగా వస్తున్న ఓటర్ కార్డులను పోస్టాఫీసు ద్వారా పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బీఎల్ఓ లకు ఐడీ కార్డ్ ల పంపిణీ పూర్తి చేశామన్నారు. నూతన ఎపిక్ కార్డులను పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని, జిల్లాలో చనిపోయిన వారిని గుర్తించి, మిగతా వారి వయస్సు ధ్రువీకరణను పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్ , అబ్దుల్ హమీద్, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్)లోని గురుకుల పాఠశాలను గురువారం కలెక్టర్ హైమావతి సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు భద్రత ఉంటుందని చెప్పారు. ఈ నెల 7న విద్యార్థి వివేక్ మృతి చెందిన విషయంపై తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావదని హెచ్చరించారు. రాత్రి వేళ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పిల్లలను బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

ఎంచె దాటేదెలా.. పంట చేరేదెలా!

వరద మిగిల్చిన నష్టం అన్నదాతలను వీడటం లేదు. మంజీరా వరదలతో కుర్తివాడ ఎంచె (వంతెన)కొట్టుకు పోయింది. ఇంత వరకు తాత్కాలిక మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో వంతెన అవతల మంజీరా ఒడ్డున సాగుచేసిన 200 ఎకరాల పంట నీటిపాలైంది. అలాగే సుమారు 800 ఎకరాల్లో పండిన వరి పంట కోత కొచ్చింది. కోసిన ధాన్యం ఇంటికి రావాలంటే ఎంచె ఒక్కటే మార్గం. 2008లో అప్పటి ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి చొరవతో రూ.78 లక్షల వ్యయంతో ఈ వంతెన నిర్మించారు. ఇటీవల వరదలతో రోడ్డు కొట్టుకు పోయిందని, ఇప్పుడు ధాన్యం ఇంటికి తీసుకు రావాలంటే మార్గం మూసుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వర్షాలు పడితే చేతికొచ్చిన పంట కూడా నీటి పాలవుతుందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– పాపన్నపేట(మెదక్)



కుర్తివాడ శివారులో కొట్టుకు పోయిన వంతెన

కోత కష్టాలు

పంట చేతికందే సమయంలో అకాల వర్షాలకు వరి నేలవాలింది. దీంతో రైతులు కోతలకు తంటాలు పడుతున్నారు. అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, రామవరం, పోతారం(జే), ధర్మారం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. పొలంలోనే మొలక వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గి మద్దతు ధర లభించదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)



రేగొండలో నేలకొరిగిన వరి పంట

క్లుప్తంగా

సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు: డీఎస్పీ

154 సైలెన్సర్స్ ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. గురువారం పటాన్‌చెరు, ఇస్నాపూర్, అమీన్‌పూర్‌లో పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైలెన్సర్లను మార్పు చేసి పెద్ద శబ్దాలతో నడుపుతూ వృద్ధులకు గర్భిణీలకు ఇబ్బంది కల్పిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 154 మంది వాహనదారులను పట్టుకున్నారు. వారికి జరిమానా విధించారు. సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

ముగ్గురికి జైలు శిక్ష

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష పడినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరు పర్చగా, విచారణ అనంతరం 27 మందికి రూ.37,500 జరిమానాతో పాటు వీరిలో ముగ్గురు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటో బోల్తా.. ఇద్దరి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తా వద్ద ఆటోబోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామం నుంచి గురువారం జహీరాబాద్‌కు వస్తున్న ఆటోను వెనుకాల నుంచి మరో వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న శ్రీనివాస్, రవిలకు గాయాలైయ్యాయి. వారిని వెంటనే జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: ఆటో బైక్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం నర్సాపూర్‌లోని ప్రధాన రహదారిపై జరిగింది. పట్టణానికి చెందిన అనిల్ ప్రయాణిస్తున్న బైకును ఆటో వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో అనిల్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): ప్రమాదశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలం పల్వంచలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాయి కోటి కృష్ణ(32) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచుగా చేపలు పడుతుంటాడు. గురువారం ఉదయం చెరువు వైపుకు వెళ్లిన కృష్ణ ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహాన్ని బయటకు తీశారు.

విద్యార్థిని మేఘన అంత్యక్రియలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో విద్యార్థిని మల్లం మేఘన అంత్యక్రియలు అశ్రునయనాలతో జరిగాయి. గ్రామంలోని హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య కూతురు మేఘన ఈనెల 6న రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి గురువారం ఇంటికి తీసుకువచ్చారు. బాధిత కుటుంబాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.

కొత్త కారును ట్రయల్ చేస్తూ..

సిద్దిపేటజోన్: కారు కొనేందుకు వెళ్లి ట్రయల్ చేస్తూ ప్రమాదవశాత్తు ఇంటిని ఢీ కొట్టిన కారు ఘటనలో పెను ప్రమాదం తప్పింది. గురువారం స్థానిక మున్సిపల్‌లో పనిచేసే ఒక ఉద్యోగి పట్టణ శివార్లలో ఒక కారు కన్సల్టెన్సీలో కారు కొనుగోలు చేశాడు. ట్రయల్ చూసేందుకు భార్యాభర్తల ఇద్దరూ కారులో వెళ్తుండగా స్థానిక జిల్లా గ్రంథాలయం సమీపంలో ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి పక్కనే ఉన్న రెండు ఇళ్లను ఢీ కొట్టింది. ఘటనలో దంపతులు గాయపడ్డారు. కొద్దీ నిమిషాల ముందు ఇంట్లోని ఇరువురు బయటకు వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందనే చెప్పాలి.

దిగుబడి.. దిగాలు

రైతులకు ఈసారి కలిసిరాని పత్తి సాగు!



పత్తి పంట

- పత్తిని ముంచిన అధిక వర్షాలు
- ఈసారి వేధిస్తోన్న కూలీల కొరత
- పెట్టుబడులు రావడంలేదని రైతుల ఆవేదన

రాయికోడ్(అందోల్)/న్యాల్‌కల్ (జహీరాబాద్): ఈ ఏడాది పత్తి సాగు రైతులకు కలిసిరాలేదు. అధిక వర్షాలకు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. రూ.వేలల్లో పెట్టుబడులు వెచ్చించిన రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంలేదని వాపోతున్నారు. ఎకరాకు కనీసం 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడిని ఆశించిన రైతులకు కేవలం మూడు నుంచి నాలుగు క్వింటాళ్లే వస్తుండటంతో రైతులు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు.

జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా సుమారు 3,87,539 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. సదాశివపేట, రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి, నారాయణఖేడ్, మనూరు తదితర మండలాల్లో అధికంగా సాగు చేశారు.

అప్పటికే పత్తి పంటపై ఎకరా సాగు కోసం రూ.30 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. తొలుత పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలో పత్తి రైతుల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ వర్షాలకు పత్తిపంటలు దారుణంగా దెబ్బతినడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. వచ్చిన దిగుబడినైనా దక్కించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కూలీలకు అధిక రేట్లు ఓ వైపు, కూలీల కొరత మరోవైపు పత్తిరైతులను తీవ్రంగా వేధిస్తున్నాయి. పత్తితీత కోసం కిలో రూ.16 చొప్పున కూలీలకు చెల్లించాల్సి వస్తుండటంతో రైతులు నష్టాల బాట పడుతున్నారు.

వేధిస్తోన్న కూలీల కొరత

జిల్లాలో కూలీల కొరత ఉండటంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, మైబూబ్ నగర్, రంగారెడ్డి, దేవరకొండ, కర్నూల్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఆటోలు, ఇతర వాహనాలను ద్వారా కూలీలను తెప్పించుకుని రైతులు పత్తితీత పనులు కొనసాగిస్తున్నారు. కూలీలను ఇతర ప్రాంతాల నుంచి రప్పించేందుకు అయ్యే రవాణ ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తోంది. ఇక వలస కూలీలకు వారానికొకసారి దావత్ కూడా ఇవ్వవలసి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

రూ.12 వేలు చెల్లిస్తే...



ఆశించిన స్థాయిలో కాయలు లేని పత్తి చెట్టు

క్వింటాలు పత్తికి రూ.8,110లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడులు తగ్గనుండటంతో తాము నష్టపోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లిస్తే నష్టాల నుంచి కొంతమేర బయట పడొచ్చని రైతులు ఆశిస్తున్నారు.

కూలీలు దొరకడం లేదు



నాలుగు ఎకరాల్లో పత్తిని సాగు చేసి రూ.లక్షకు పైగా వెచ్చించాను. పత్తితీతకు స్థానికంగా కూలీలు దొరకడం లేదు. యాసంగి పంటలపైనే ఆశలు పెట్టుకున్నాను.

-భాగన్న, రైతు మాటూర్ గ్రామం

రూ.12 వేల ధర నిర్ణయించాలి



అధిక వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. ప్రభుత్వం క్వింటాలు పత్తికి కనీసం రూ.12 వేలు నిర్ణయించి ఆదుకోవాలి. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడే వస్తోంది. దీంతో వెచ్చించిన పెట్టుబడులు వస్తే చాలని భావిస్తున్నాం.

-గోపాల్‌రెడ్డి, రైతు, ఖాంజమాల్‌పూర్ రాయికోడ్ మండలం

తీతలో జాగ్రత్తలు పాటించాలి

పత్తి పూత, కాత సమయాల్లో వర్షాలు అధికంగా కురవడంతో పత్తి దిగుబడి పడిపోయింది. దీంతో తీతలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. పత్తికాయ నుంచి పత్తిని పూర్తిగా తీయాలి. రవాణాలో పత్తి వృథాను అరికట్టాలి. పంటకు దుమ్ముధూళి అంటుకోకుండా చూసుకోవాలి. సూర్యోదయం అనంతరమే పత్తిని తీయాలి. పంటను ఆరబెట్టి నాణ్యతను కాపాడుకోవాలి.

-సత్యనారాయణ, ఏడీఏ రాయికోడ్.

కారు చీకట్లో కాంతి రేఖ..!

- కార్నియా సమస్యతో బాధపడే వారికి కేంద్రం శుభవార్త
- చనిపోయిన వ్యక్తి నుంచి నాలుగు నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరణ
- హైదరాబాద్ సరోజినిదేవి ఆసుపత్రికి తరలించి చికిత్స
- పైలెట్ ప్రాజెక్టు కింద సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఎంపిక

సిద్దిపేటకమాన్: కార్నియా కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఇదో శుభవార్త. తిరిగి చూపును ప్రసాదించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. పైలెట్ ప్రాజెక్టు కింద పోస్టు గ్రాడ్యుయేషన్ టీచింగ్ సదుపాయం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా సిద్దిపేట, నిజామాబాద్, ఆదిలాబాద్ మూడు ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేసింది. ప్రభుత్వాసుపత్రిలో చనిపోయిన వ్యక్తి నుంచి ఆసుపత్రి ఆప్తమాలజీ విభాగ వైద్యులు కార్నియా సేకరించి హైదరాబాద్ సరోజిని దేవి కంటి ఆసుపత్రికి పంపుతారు. వాటిని అవసరమైన వారికి అమర్చి తిరిగి కంటి చూపును ప్రసాదించనున్నారు. ఇందుకోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు, వైద్యులు, సిబ్బందికి శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఆరు గంటల్లోపు కార్నియా సేకరణ

సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చే మృతదేహాల నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరించి, ప్రత్యేక బాక్సులో స్టోర్ చేస్తారు. ఆర్టీసీ ద్వారా హైదరాబాద్ సరోజినిదేవి కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రెండు కార్నియాలు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు చూపును తిరిగి తీసుకురావచ్చని ఆసుపత్రి ఆప్తమాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

స్టాఫ్ నర్సులకు అవగాహన

సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత ఆధ్వర్యంలో ఆప్తమాలజీ హెచ్ఓడీ చంద్రశేఖర్ వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలోని స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చారు. దీంతో ఆసుపత్రిలో మృతుడి కుటుంబ సభ్యులు, వారి అటెండ్లకు కార్నియా డొనేట్ చేసేలా కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించనున్నారు.

వైద్యులు, సిబ్బందికి అవగాహన



చనిపోయిన వ్యక్తి నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరించి సమస్యతో బాధపడుతున్న వారికి అమర్చడం వల్ల కంటి చూపును ప్రసాదించవచ్చు. పైలెట్ ప్రాజెక్టు కింద సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎంపికైంది. చనిపోయిన వ్యక్తి నుంచి కార్నియా దానం చేసేలా వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడానికి ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

- డాక్టర్ సంగీత, సూపరింటెండెంట్ సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి



స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, ఆప్తమాలజీ హెచ్ఓడీ చంద్రశేఖర్

ఉపాధ్యాయుడిపై దుండగుల దాడి

నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై గుర్తు తెలియని ఆటో డ్రైవర్ మరో ముగ్గురు వ్యక్తులు కలిసి దాడి చేశారు. నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. ఈ సంఘటన నర్సాపూర్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలోని మంతూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తుంగని కిష్టయ్య కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో తన సొంత పనులు ముగించుకుని కొల్చారం బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్నాడు. నర్సాపూర్ వైపు వస్తున్న ఆటోలో ఎక్కాడు. అయితే డ్రైవర్ ఒక్కసారిగా తూప్రాన్ వైపు ఆటోను స్పీడ్‌గా తీసుకెళ్లాడు. ఆటో డ్రైవర్ మరో ముగ్గురు వ్యక్తులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తూప్రాన్ రోడ్డులోని కుంటలోకి ఉపాధ్యాయుడిని తీసుకెళ్లి చాకులతో బెదిరించి దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ 12 వందలు, సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ

శభాష్.. దుర్గయ్య

- బస్సులో మరిచిపోయిన 39 తులాల బంగారం బ్యాగ్ అప్పగింత
- నిజాయితీ చాటుకున్న ప్రయాణికుడికి డిపో సిబ్బంది సన్మానం

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు దుర్గయ్య నిజాయితీ చాటుకున్నాడు. సంగారెడ్డికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి వసుధ ప్రకాష్ భార్యాభర్తలు గురువారం సికింద్రాబాద్‌లో 39 తులాల బంగారం కొనుగోలు చేశారు. అనంతరం జూబ్లీహిల్స్ బస్టాండ్ నుంచి సంగారెడ్డికి బస్సులో తిరిగి వస్తుండగా బ్యాగ్ సీట్‌లో పడిపోయింది. అయితే అదే బస్సులో ప్రయాణిస్తున్న దుర్గయ్య అనే ప్రయాణికుడు కండక్టర్ శ్రీధర్ రెడ్డికి బ్యాగ్‌ను అందజేశాడు. వెంటనే డిపో మేనేజర్‌కు తెలియజేయగా.. సంబంధిత ప్రయాణికులకు సమాచారం అందించి సుమారు రూ.50 లక్షల విలువ చేసే 39 తులాల బంగారు బిస్కెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నిజాయితీ చాటుకున్న దుర్గయ్యను ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులు అతడికి ధన్యవాదాలు తెలిపారు.



బంగారాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మహమ్మద్ మైనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 13న అప్పాజీపల్లికి చెందిన బుడ్డెనోళ్ల సురేశ్ (24) మంజీరా ఆనకట్ట దిగువ భాగంలో చేపల వేట కోసమని వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి వరదలో కొట్టుకుపోయాడు. అదే రోజు సురేశ్ ఆచూకీ కోసం అగ్నిమాపక, టీజీఎఫ్ బృందాలు గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు. గురువారం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా.. చిన్నఘనాపూర్ శివారులోని తుమ్మల బొడ్డె ప్రాంతంలో అతడి మృతదేహం లభించింది. కేసు దర్యాప్తులో ఉంది.

రేగులపల్లెలో చోరీ

బెజ్జంకి(సిద్దిపేట): రేగులపల్లెలో చోరీ జరిగింది. దేవిశెట్టి శ్రీనివాస్‌రావు అనే ఆటో డ్రైవర్ ఇంట్లో బుధవారం రాత్రి దుండగులు రూ.40 వేల నగదు, రెండున్నర గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. వీరితో పాటు మరో రెండు ఇళ్లల్లోనూ చోరీకి యత్నించారని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఒకరి రిమాండ్: ఇసుక అక్రమ రవాణా కేసులో తోటపల్లికి చెందిన చొక్కాల రాజయ్యను గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

వ్యక్తి ఆత్మహత్య



రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబుబ్ కథనం ప్రకారం.. గాగ్గిళ్లాపూర్‌కు చెందిన ఏలూరి రామకృష్ణ (33) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రామకృష్ణకు తొమ్మిదేళ్ల క్రితం దూల్మిట్ట మండలం తోర్నాలకు చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల కూతురు ఉంది. నాలుగేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అనంతరం రామకృష్ణ మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య మమత రామకృష్ణకు పలుమార్లు ఫోన్‌చేసి నీతోనే ఉంటానని చెప్పడంతో రామకృష్ణ పెద్దమనుషుల సమక్షంలో రెండో భార్యకు విడాకులు ఇచ్చి, మొదటి భార్యతో తిరిగి కాపురం పెట్టాడు. రెండు నెలల క్రితం మమత తన భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడంలేదు. దీంతో మనస్తాపానికి గురైన రామకృష్ణ.. తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు.

భార్యతో గొడవపడి..

ఉరేసుకొని బలవన్మరణం



సంగయ్య

నారాయణఖేడ్: మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రావుల శ్రీశైలం కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చాకలి సంగయ్య(57), మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. తాగిన మైకంలో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి సైతం మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. తాగి ఎందుకు గొడవచేస్తావని ఆమె ప్రశ్నించడంతో ఆవేశంతో పట్టణంలోని ఆక్సిజన్ పార్కులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతిపై అతడి భార్య, ఇతర కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంతానం కలగడం లేదని..

సంగారెడ్డి టౌన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన మన్నే రాజశేఖర్(39), స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరగగా ఇప్పటి వరకు ఎలాంటి సంతానం లేదు. ఇంట్లో గొడవల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విరామమెరుగని బోధన

ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగ రాములు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గంగ రాములు

హత్నూర(సంగారెడ్డి): పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు 80 ఏళ్ల వృద్ధాప్యంలో సైతం విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల కేంద్రమైన హత్నూరకు చెందిన కోట గంగ రాములు 1968లో ఉపాధ్యాయుడిగా జిన్నారం మండలం శివనగర్ పాఠశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభించి.. 2004 ఏప్రిల్‌లో మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం గంగారం పాఠశాలలో పదవీ విరమణ పొందారు. అనంతరం బోరపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది సంవత్సరాలుగా ఉచితంగా తెలుగు బోధన చేశారు. దౌల్తాబాద్ పాఠశాలలో రెండేళ్లు, కొన్యాల పాఠశాలలో ఐదు నెలలు తెలుగు బోధించారు.

2011 నుంచి హత్నూర కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో 14 ఏళ్లుగా ఉచితంగా విద్యార్థినులకు తెలుగు బోధిస్తున్నారు. వద్ధాప్యంలో 9 ఏళ్ల క్రితమే భార్య లక్ష్మీనరసమ్మ మృతి చెందింది. సంతానం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల పిల్లలనే తన పిల్లలనుకుంటున్నారు. ప్రతిరోజు సమయానికి పాఠశాలకు వచ్చి పిల్లలతోనే భోజనం చేసి సాయంత్రం వరకు వారికి బోధిస్తున్నారు. 1999లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం నుంచి అవార్డు సైతం అందుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి నెల పెన్షన్ విద్యార్థుల అవసరాలకు, ఆడపిల్లల చదువులు, పెళ్లిళ్లకు కొంతమేర సహాయం అందిస్తానని గంగ రాములు తెలిపారు. 80 ఏళ్ల ఉచితంగ బోధిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు.

మనసున్న మాస్టారు..



వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించిన దృశ్యం

- 39 మంది విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత
- ఉపాధ్యాయుడు రమేశ్ సేవలు అభినందనీయం: హెచ్‌ఎం

తొగుట(దుబ్బాక): విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన ఉపాధ్యాయుడు ముక్క రమేశ్ అభినందనీయుడని ప్రధానోపాధ్యాయుడు నయీమా కౌసర్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో చేరిన 39మందికి రమేశ్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పేద కుటుంబాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని గమనించి వారి అవసరాలను తీర్చడం గొప్ప విషయమన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులకు ఏదో రకంగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఒరాకిల్ స్వచ్ఛంద సంస్థ నుంచి రూ 40వేల విరాళంగా సేకరించడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు రూ 5వేల విలువగల క్రీడా సామగ్రిని అందించారని తెలిపారు. విద్యార్థులు ఎంఎంఎస్ పరీక్షలకు సిద్ధం కావడానికి రూ 3వేల విలువగల పుస్తకాలు అందించారని గుర్తుచేశారు. రమేష్ అందిస్తున్న సేవా కార్యక్రమాల మూలంగా పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతోందన్నారు.

సైబర్ మోసం.. నిందితుడి అరెస్ట్

హత్నూర(సంగారెడ్డి): ఫేక్‌డీపీతో అమ్మాయిలా పరిచయమై ఓ ఇంజనీరింగ్ విద్యార్థి నుంచి రూ.10.33 లక్షల కాజేసిన సంఘటన హత్నూర మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడికి సహకరించిన మరో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు జిన్నారం సీఐ నయీముద్దీన్, హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డిలు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఆన్‌లైన్‌లో అమ్మాయి ఫొటోతో ఇంజనీరింగ్ విద్యార్థికి పరిచయమై డబ్బులు వసూ లు చేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి ప్రధాన నిందితుడు సీలం సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేయగా అతడికి సహకరించిన అతడి స్నేహితుడు గడ్డం ప్రకాశ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. రెండవ నిందితుడు గడ్డం ప్రకాశ్ నుంచి రూ. 46 వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సైబర్ మోసానికి పాల్పడుతున్న మరి కొందరిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితులది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపూర్‌గా పేర్కొన్నారు.